క్లుప్తంగా

దేవాలయ నిర్మాణానికి రూ.35వేలు విరాళం



విరాళం అందిస్తున్న వీరభద్రం, జ్యోతి దంపతులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్ రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ నిర్మాణానికి ఇద్దరు దాతలు ఆదివారం రూ.35,116లను విరాళం అందించారు. కైకొండాయగూడెం చెందిన గిరిబోయన వీరభద్రం, జ్యోతి దంపతులు రూ. 25,116లు, ప్రశాంతినగర్‌కు చెందిన గుండోజు పూర్ణచారి, నాగమణి దంపతులు రూ.10,116లను దేవాలయ కమిటీ వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు కొమ్ము భాస్కరరావు, కార్యదర్శి సూరంశెట్టి నర్సింహారావు, కోశాధికారి గుండోజు రామాచారి, కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, రామారావులు పాల్గొన్నారు.

రైసెట్‌లో ఉచిత శిక్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్ తరుణీహాట్‌లో గల రైసెట్ కేంద్రంలో నిరుద్యోగ యువతకు వచ్చే నెలలో పలు కోర్సుల్లో స్వయం ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రైసెట్ మేనేజర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల 18 ఏళ్ల నుంచి 45 ఏళ్లు కలిగిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఛత్రపతి శివాజీ జయంతి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఖమ్మం మామిళ్లగూడెం: నేటి యువతకు ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని హిందూవాహిని రాష్ట్ర సమన్వయ సమితి మెంబర్ పీ.వీ.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం శివాజీ జయంతి సందర్భంగా సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో గత కొన్నేళ్లుగా శివాజీ జయంతిని ఉత్సాహంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. నేడు (సోమవారం) ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రం నుంచి జమ్మిబండ వరకు సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఛత్రపతి శివాజీ శోభా యాత్రలో యువత పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా సంయోజక్ బోయినసందీప్, నవీన్, శ్రీకాంత్, శశి, రవికుమార్, సంజయ్, సాత్విక, దినేశ్, ఉదయ్, కోటి,శ్యామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం మండలంలోని తిప్పారెడ్డిగూడెంలో పార్టీ సీనియర్ నాయకులు వేల్పుల చంద్రయ్య సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. చంద్రయ్య పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని తెలిపాక నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి గొర్రెపాటి రమేశ్, గ్రామ పెద్దలు సూరయ్య, సైదులు, అచ్చా ఉప్పలయ్య, పోలేపొంగు నాగయ్య, గొర్రెపాటి వీరస్వామి, శ్రీనివాసరెడ్డి, మల్సూరు, కొమరెల్లి, నరసయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఊరుపేరు భైరవకోన
వినోద	మేడామే వెబ్ ఇంగ్లీష్. అంబాజీ పేట మ్యారేజీ బ్యాండ్
సాయిరాం	రాజధాని ఫైల్స్
ఆదిత్య	ఓయ్
శ్రీనివాస	ఈగల్
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	36		20
బెండకాయ	56	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	56	చుక్కకూర	3
బీర	40		20
దొండ	38	తోటకూర	2
పొట్లకాయ	48		10
చిక్కుడు	76	గోంగూర	2
గోరుచిక్కుడు	50		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	30	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఇల్లెందు క్రాస్ రోడ్డువైపు వెళ్లే ఫుట్‌పాత్‌లపై పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు



ఫుట్‌పాట్లు..!

పేరుకే నగరంలోని ఫుట్‌పాత్‌ల నిర్మాణం

- నడిచేందుకు వీలులేకుండా ఆక్రమణలు
- అసహనం వ్యక్తం చేస్తున్న పాదచారులు
- అధికారులు హెచ్చరించినా.. పట్టించుకోని వ్యాపారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఆక్రమణలకు అతీతం ఏదీ కాదన్న చందంగా తయారయ్యాయి నగరంలోని ఫుట్‌పాత్‌లు. తమ అవసరాల కోసం వ్యాపారులు ఫుట్‌పాత్‌లను కూడా వదలడం లేదు. దుకాణాల ముందు రోడ్డుపై, ఫుట్‌పాత్‌లపై సామన్లు, వాహనాలు నిలుపుతూ పాదచారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. నగరంలో మున్సిపల్ అధికారులు పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించి తమ వ్యాపార అవసరాల కోసం వినియోగిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించినా పట్టించుకోకపోవడంతో పాటు ఎవరు చెప్పినా.. ఎవరికి ఫిర్యాదు చేసినా.. తాము మాత్రం ఫుట్‌పాత్‌లను వదలమంటూ వ్యాపారులు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అసలే ఫుట్‌పాత్‌లు సక్రమంగా లేక రోడ్డుపై నడిచేందుకు పాదచారులు ఇబ్బందులు పడుతుండగా.. ఉన్న వాటిని ఆక్రమించి నడిచేందుకు వీలు లేకుండా చేస్తుండడంతో నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు నిర్మించింది వ్యాపారుల కోసమా.. పాదచారుల కోసమా అన్న చందంగా తయారయ్యాయి.



వైరా రోడ్డులో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలు

ఫుట్‌పాత్‌లపైనే వ్యాపారాలు..

నగరంలో పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఖమ్మం మయూరిసెంటర్ నుంచి వైరా రోడ్డు, జెడ్పీ సెంటర్ వరకు ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఫుట్‌పాత్ ఉంది. దీని నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పలువురు వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే నిర్మాణాలు చేపట్టడంతో అవి శిథిలావస్థకు చేరాయి. అంతేకాక నడిచేందుకు వీలు లేకుండా ఉన్నాయి. పలుచోట్ల ఫుట్‌పాత్ ఉన్నా.. వాటిపై వ్యాపారులు తమ వాహనాలు, ఇతర సామన్లు పెట్టడంతో పాదచారులు రోడ్డుపై నడవాల్సిన పరిస్థితి ఉంది. ఇక జెడ్పీసెంటర్ నుంచి ప్రభుత్వ ఆస్పత్రి మీదుగా ఇల్లెందు క్రాస్‌రోడ్డు వరకు కొత్తగా నిర్మించిన ఫుట్‌పాత్‌ను సైతం వ్యాపారులు వదిలిపెట్టకుండా ఏకంగా ఫుట్‌పాత్‌లపై ద్విచక్ర వాహనాలను పార్క్ చేస్తున్నారు. పాదచారుల కోసం నిర్మించిన వాటిపై వాహనాలను నిలపడమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆదేశాలు బేఖాతర్..

పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లపై వాహనాలను పార్క్ చేయొద్దని, ఇతర సామన్లు పెట్టొద్దని కేఎంసీ అధికారులు వ్యాపారులను పలు సందర్భాల్లో ఆదేశించారు. అయినా వ్యాపారులు అధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తూ తమకు నచ్చినట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల కేఎంసీ కమిషనర్ సైతం నేరుగా ఫుట్‌పాత్‌లను పరిశీలించి మరీ సూచనలు చేసినా వ్యాపారులు పట్టించుకోలేదు. ఇక పెరిగిన ట్రాఫిక్‌తో రోడ్డుపై నడిచి వెళ్లే వారికి వాహనాలు తగులుతుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రధాన రహదారుల్లో ఉన్న ఫుట్‌పాత్‌లను పాదచారులు మాత్రమే వినియోగించుకునేలా చూడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

నడవలేకపోతున్నాం..



నగరానికి పలు పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటాను. పలు దుకాణాలకు వెళ్లేందుకు ఎక్కువగా రోడ్డుపై నడిచే తిరుగుతుంటాను. వాహనాల రద్దీతో రోడ్డుపై నడవలేకపోతున్నాం. ఫుట్‌పాత్‌లపై నడుద్దామంటే వ్యాపాలరులు ఆక్రమించి వాహనాలను పార్క్ చేస్తున్నారు. పాదచారులు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకోవాలి.

– డి.వెంకటేశ్, పాదచారుడు

వాహనాలు నిలపకుండా చూడాలి..



నగరంలో ప్రధాన రహదారుల వెంట ఉన్న ఫుట్‌పాత్‌లు నడిచేందుకు వీలు లేకుండా ఉన్నాయి. ఫుట్‌పాత్‌లపై వాహనాలను నిలపకుండా నడిచేందుకు వీలులేక పాదచారులు రోడ్డుపై నడవాల్సి వస్తుంది. ఇలా నడుస్తున్న క్రమంలో పాదచారులు పలు రోడ్డు ప్రమాదాలకు గురతున్నారు. అధికారులు ఫుట్‌పాత్‌లపై వాహనాలు నిలపకుండా చూడాలి.

– వి.వెంకటేశ్, నగరవాసి

కృష్ణయ్య జీవితం స్ఫూర్తిదాయకం..



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, తదితరులు

ఖమ్మం రూరల్: కమ్యూనిస్టుగా తుదిశ్వాస వరకు కృషి చేసిన హనుమంతు కృష్ణయ్య జీవితం భవిష్యత్ పోరాటాలకు స్ఫూర్తిదాయకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఆదివారం మండలంలోని కామంచికల్లులో కృష్ణయ్య 19వ వర్ధంతి నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పాత ఖమ్మం తాలుకాలో బలమైన కమ్యూనిస్టు నాయకుడు కృష్ణయ్య అనిఆయన వారసులుగా ఈ ప్రాంతంలో నేటికీ కమ్యూనిస్టు పార్టీని బలమైన పార్టీగా కొనసాగిస్తున్న ప్రతి ఒక్కరూ అభినందనీయులు అన్నారు. పాలకపక్షం ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవని తెలిపారు. ఒక పక్క మతోన్మాదం, మరో పక్క ఆర్థిక అంతరాలు దేశాన్ని ప్రమాదంలో నెట్టివేస్తున్నాయని అన్నారు. బీజేపీ మతోన్మాదాన్ని నమ్ముకుని రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు దేవుళ్లు, మందిరాలను తెరపైకి తీసుకొస్తుందని అన్నారు. భవిష్యత్ పోరాటాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, మౌలానా, సిద్దినేని కర్ణకుమార్, రామూర్తి, కమలాకర్, సుధాకర్, సూర్యం, శంకరయ్య, వెంకటరామనర్సయ్య, గాంధీ, మోహన్‌రావు, రాధాకృష్ణ, శారద, షాని తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో జిల్లా దూసుకుపోతుంది..

నేలకొండపల్లి: ఏపీలో విలీనమైన ఏడు మండలాలను తిరిగి తెలంగాణలోకి వచ్చేలా ప్రభుత్వం కృషి చేస్తుందని టీపీసీసీ అధికార ప్రతినిధి కల్వ సుజాత పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో అధిక స్థానాలు, మెజార్టీ అందించిన మూడు జిల్లాలో ఖమ్మం జిల్లా ప్రధానం అన్నారు. ముగ్గురు మంత్రులతో ఖమ్మం జిల్లా భవిష్యత్‌లో మరింత దూసుకుపోతుందని, ఎన్నికల సమయాన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బీఆర్ఎస్‌కు విసిరిన చాలెంజ్ నెరవేరిందన్నారు. భద్రాద్రి రామాలయం, రామదాసు మందిరాన్ని గత ప్రభుత్వాలు విస్మరించినా.. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి చెందుతుందని అన్నారు. వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. అనంతరం రామదాసు ధ్యాన మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీ భవన్ అధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్, ఎంపీటీసీ రేగూరి వాసవి, మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ చిలకబత్తిని వీరబాబు, మోర మల్లయ్య, రాయపూడి నారాయణరావు, శ్రీనివాస్‌సింగ్, రాయపూడి శ్రీనివాస్, కడియాల నరేశ్, రెడ్డిమళ్ల బాబురెడ్డి, చెరుకు రంగయ్య, పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.



సుజాతను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ..



నేలకొండపల్లి: బౌద్ధక్షేత్రం వద్ద పూర్వ విద్యార్థుల సందడి



కామేపల్లి: సమ్మేళనంలో పాల్గొన్న నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

నేలకొండపల్లి: నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి (1988–89 బ్యాచ్) చదివిన పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తొలుత నాడు చదివిన పాఠశాలను సందర్శించి నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం పట్టణంలోని పలు దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశాక.. బౌద్ధక్షేత్రం వద్ద ఆట, పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తాటికొండ రామారావు, మల్లికార్జున్, గోవింద్, బాలాజీ, ఆర్.నరసింహారెడ్డి, కనపర్తి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నేకల్ హైస్కూల్‌లో..

కామేపల్లి: పొన్నేకల్ హైస్కూల్‌లో చదివిన పదో తరగతి(2008–09 బ్యాచ్) పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 15 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. అనంతరం నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాటి గురువులు వెంకట్రామిరెడ్డి, దుర్గాప్రసాద్, రంగాచారి, లక్ష్మ ణరావు, వెంకటరెడ్డి, వీరన్న, అజయ్‌సింగ్, విజయలక్ష్మి, నాగమణి, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

అడుగంటిన 'గంగాదేవి'..



మైదానాన్ని తలపిస్తున్న గంగాదేవి చెరువు

కూసుమంచి: ఈ ఏడు వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు కుంటలు అడుగంటి పోతున్నాయి. దీంతో వేసవి ప్రారంభం కాకముందే చెరువులు ఖాళీ అయి మైదానంలా దర్శనమిస్తున్నాయి. దీంతో పశుపక్షాదులు తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. సాగర్ జలాలు కూడా సరఫరా కాకపోవడంతో పాలేరు రిజర్వాయర్ నీటిని తాగునీటి అవసరాలకే వినియోగిస్తుండగా భక్తరామదాసు ప్రాజెక్టు నీటిని నిలిపివేశారు. దీంతో చెరువులకు నీరు చేరే పరిస్థితి లేకుండా పోయింది. ఫలితంగా చెరువుల కింద సాగుచేసిన పంటలకు తడులు అందక రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈవేసవి ఎలా గట్టెక్కుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మ్యాథమెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



బత్తుల కార్తీక్

కామేపల్లి: కొత్తలింగాల గ్రామంలోని శ్రీ సాయి వివేక భారతి స్కూల్‌లో చదువుతున్న జాస్తిపల్లి గ్రామానికి చెందిన బత్తుల కార్తీక్ ఎస్సార్ఎఫ్ ఒలంపియాడ్ మ్యాథమెటిక్స్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. అదే విధంగా జిల్లాస్థాయిలో మేకల జాస్మిత సెకండ్ ర్యాంక్, రాయల ఇందు, కొనకంచి రితిక, హర్షత్‌కుమార్‌జిల్లా టాపర్స్‌గా నిలిచారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌లో ప్రతిభ కనబరచడంతో వారిని ప్రిన్సిపాల్ కొమ్మినేని వెంకటేశ్వరరావు, కరస్పాండెంట్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు అభినందించారు.

గొప్ప సంఘ సంస్కర్త సంత్ సేవాలాల్..



పూజలు చేస్తున్న సంఘం ప్రతినిధులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 5వ డివిజన్ యూపీహెచ్ కాలనీలో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ కిషన్‌నాయక్ ఆధ్వర్యాన సేవలాల్ 285వ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. సేవాలాల్ మహరాజ్ గొప్ప సంఘ సంస్కర్త అని, తండాలు నిర్మించడం, వ్యవసాయం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించినట్లు తెలిపారు. నాలుగో డివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి, రాధాకృష్ణ, ఉమారాణి, మణికంఠనాయక్, సూర్యనాయక్, ఎం.వీరన్న, బి.కొండల్, మల్సూర్, వినోదబాయి, లక్ష్మీబాయి, బిక్కుబాయి, లలితాబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టాలెంట్ టెస్టు



నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ పుల్లయ్య, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన విద్యాశాఖ కామన్ ఎగ్జామినేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి టాలెంట్ టెస్టు ప్రశాంతంగా జరిగినట్లు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, డీసీఈబీ సెక్రటరీ నారాయణలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13న నిర్వహించిన మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు జిల్లా స్థాయి టెస్ట్ నిర్వహించామన్నారు. ఇందులో మధిర మండలం మర్లపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి లక్కిరెడ్డి రామ మోహన్‌రెడ్డి ప్రథమ స్థానాన్ని సాధించగా.. రూ.10వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాన్ని అందించారు. అదే విధంగా ద్వితీయ స్థానాన్ని జెడ్పీహెచ్ఎస్ మాధాపురం విద్యార్థి ఉబ్బలపల్లి జశ్వంత్ సాధించగా రూ. 6వేల నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని, తృతీయ స్థానాన్ని జెడ్పిహెచ్ఎస్ మహదేవపురం విద్యార్థిని పోర్లు నందిని సాధించగా రూ.4 వేల నగదు పురస్కారాన్ని, జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందించారన్నారు. తొలుత ప్రశ్నాపత్రాలను ఖమ్మం అర్బన్ ఎంఈఓ ఎం. శ్రీనివాస్ ఆవిష్కరించగా.. ఎంఈఓ శ్యామ్‌సన్, జిల్లా సైన్స్ అధికారి జగదీశ్, పి.ప్రభాకర్ రెడ్డి, రిక్కాబజార్ హైస్కూల్ హెచ్ఎం వి.శాంత, రామ్మోహన్‌రావు, అజిత, సుబ్బారావు, లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

రాంకిషన్‌రావు జీవితం ఆదర్శప్రాయం

ఖమ్మంలీగల్: కీర్తి శేషులు, దివంగత సీనియర్ న్యాయవాది మాదిరాజు రాంకిషన్‌రావు జీవితం ఆదర్శప్రాయమని, న్యాయవాదులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ఎస్.జగ్జీవన్‌కుమార్ అన్నారు. ఖమ్మం నగర శివారు గోపాలపురంలోని దత్తాత్రేయ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తి జీవితం కాకుండా మరేదైనా ప్రవృత్తిగా చేయాలంటే కష్టంగా అనిపిస్తోందని, ఇప్పుడు వృత్తి జీవితంలో ఉన్నవారికి అసలు ఖాళీ సమయమే దొరకడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ తర్వాత కూడా ఖాళీ దొరికే పరిస్థితులు కనిపించడం లేదన్నారు. రాంకిషన్ రావు పీపీ, జీపీ పదవులు నిర్వహించి వాటికి వన్నె తెచ్చారని, ఇప్పుడు ఆయా పదవులు తెచ్చుకోవడానికి వేరే దారిలో వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. అనంతరం 40 ఏళ్ల వృత్తి జీవితం పూర్తి చేసుకున్న సీనియర్ న్యాయవాదులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావు, రాంకిషన్ రావు కుమారులు, మాదిరాజు లక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్, వినయ్‌కుమార్, మల్లాది వాసుదేవ్, పోట్ల మాధవరావు, కేపీ సత్యనారాయణ, హర్కార శ్రీరామ్ రావు, కిలారు బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: భారతదేశంలో చారిత్రాత్మకంగా మూడు విప్లవ పార్టీలు ఏకమై సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్‌గా ఏర్పడబోతున్నాయని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 3న సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆల్ ఇండియా యూనిటీ బహిరంగ సభ ఉంటుందని, 4, 5 తేదీల్లో ప్రతినిధుల సభలు ఉంటాయని తెలిపారు. ఈ సభలను జయప్రదం చేసేందుకు ప్రజాపంథా నాయకులు, కార్యకర్తలు జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని, గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. 3న ఖమ్మంలోనిఎస్ఆర్అండ్‌బీ జీఎన్ఆర్ కళాశాల మైదానం నుంచి ప్రదర్శన మొదలై పెవిలియన్ మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకుంటుందన్నారు. రెండు రోజుల పాటు జరిగే ప్రతినిధుల సభ ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు విప్లవకార్లు బహిరంగ సభకు హాజరవుతున్నారని, ఎర్రజెండాలు పట్టుకుని ప్రదర్శనలు కవాతు చేయాలని అన్నారు. గత పదేళ్లుగా ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలన్ని మోదీ తుంగలో తొక్కారని అన్నారు. ఈ తరుణంలో మూడు విప్లవ పార్టీల ఐక్యతా సభలకు ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. బండెల వెంకయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వి.మనోహర్‌రాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సీ.వై.పుల్లయ్య, జి.రామయ్య, ఆవుల అశోక్, కె.అర్జున్ రావు, ఎ.వెంకటరెడ్డి, ఆర్.శివలింగం, నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, మలీదు నాగేశ్వరావు, సీహెచ్.శిరోమణి, జి.లలిత, టి.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పంచాయతీల అభివృద్ధి..



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీటీసీ ఉమారాణి

నేలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని ఎంపీటీసీ మరికంటి ఉమారాణి అన్నారు. మండలంలోని భైరవునిపల్లి పంచాయతీలో ఆదివారం సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాలు పల్లెలను విస్మరించడంతో అభివృద్ధి కుంటుపడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్‌పై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయిందని, కాంగ్రెస్ వైపు అన్ని వర్గాల ప్రజలు చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వలన ప్రజాప్రతినిధులు అప్పుల పాలైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోల్ల శ్రీనివాసరావు, గండు సైదులు, మాతంగి నారాయణ, బచ్చలకూరి ముత్తయ్య, మరికంటి రమేష్, తెల్లాకుల అప్పారావు, పెద్దపాక రామకృష్ణ, మల్లేబోయిన శ్రీనివాసరావు, గోపి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

మురుగు తొలగింపు సాహసమే..



ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుధ్య సమస్యలు నిత్యకృత్యమయ్యాయి. పైపుల్లో మురుగు, చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరు వెళ్లేందుకు దారి లేక బాత్ రూముల్లో బయటకు ఉబికి వస్తున్నాయి. ఈ సమస్య ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో సర్వసాధారణమైపోయింది. కొందరు రోగులు టాయిలెట్లల్లో గుడ్డలు, సబ్బుల కాగితాలు వేస్తుండడంతో అవి పైపుల్లో చిక్కి మురుగు నీరు కాల్వల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి. ముఖ్యంగా పైఅంతస్తుల్లోని పైపుల్లో చెత్త పేరుకుపోతుండడంతో పారిశుధ్య కార్మికులు వాటిని తొలగించేందుకు పెద్ద సాహసమే చేయాల్సి వస్తోంది. కార్డియాలజీ, ట్రామాకేర్ సెంటర్ భవనాల్లోని పైపుల్లో పేరుకుపోయిన చెత్తను తీయడానికి పారిశుధ్య కార్మికులు పడుతున్న పాట్లను 'సాక్షి'కెమెరా ఇదిగో ఇలా క్లిక్ మనిపించింది.

- ఖమ్మం వైద్యవిభాగం